క్లుప్తంగా

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్లలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో 52వ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలియజేసింది. 18వ తేదీ ఉదయం 4గంటలకు గంగా స్నానం, రాత్రి 7గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, 19వ తేదీన మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం 2గంటలకు అగ్ని గుండాలు, బోనాలు, గొర్రె పోతుల బండితో ఊరేగింపు, గొలుసులు తెంపుట, అన్నదానం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి


లేక్‌వ్యూకాలనీలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మార్త వాణి

నిజాంపేట్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్ మార్త వాణి అన్నారు. శుక్రవారం ప్రగతినగర్‌లోని లేక్‌వ్యూకాలనీలో చేపడుతున్న సీసీరోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ మోహన్‌ను ఆదేశించారు. కార్పొరేటర్ వెంట ఏఈ లక్ష్మీనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, సుభాష్, లేక్‌వ్యూ కాలనీవాసులు ఉన్నారు.

విద్యార్థిని తండ్రిపై కళాశాల ఏవో దాడి

దుండిగల్: ఓ ఇంజినీరింగ్ విద్యార్థి తండ్రిపై కళాశాల ఏవో దాడి చేశాడు. దుండిగల్‌లోని ఐఏఆర్ఈ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని తీసుకువెళ్లేందుకు శుక్రవారం ఆమె తండ్రి కళాశాలకు వచ్చాడు. కారును గేటు ఎదుట నిలపడంతో సెక్యూరిటీతో వాద్వాదం చోటు చేసుకుంది. మాటామాటా పెరగడంతో అక్కడికి చేరుకున్న కళాశాల ఏవో రాజేష్ విద్యార్థి తండ్రిపై దాడి చేశాడు. దీంతో బాధితుడు దుండిగల్ పోలీసులను ఆశ్రయించగా ఇద్దరి మధ్య రాజీ కుదరడంతో కేసు నమోదు కాలేదు.

మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ డీసీపీ డీవీ శ్రీనివాసరావు

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ సమీపంలోని ఎన్‌సీఎల్ సౌత్‌లోని డీమార్ట్ సమీపంలోని భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ కార్యాలయాన్ని శుక్రవారం ట్రాఫిక్ డీసీపీ డీవీ శ్రీనివాస్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఇదే భవనంలో ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయం సైతం కొనసాగుతోంది. స్థానికంగా ట్రాఫిక్ ఏసీపీ, డీసీపీ కార్యాలయాలు అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్ సమస్యలపై సత్వరమే చర్యలు తీసుకోవడంతో పాటు సిబ్బంది పర్యవేక్షణ సులభతరమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

మహాశివరాత్రికి దేవాలయాల ముస్తాబు


సూరారం ఉమామహేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు


పేట్‌బషీరాబాద్‌లోని శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి


సుభాష్‌నగర్‌లోని కాశీవిశ్వేశ్వర స్వామి


సూరారంలో కొలువైన ఉమామహేశ్వరుడు

రంగారెడ్డినగర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ప్రముఖ శివాలయాలు ముస్తాబవుతున్నాయి. భక్తులు రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల వద్ద చలువ పందిర్లు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు. శనివారం తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగనున్నాయి.

◆ సుభాష్‌నగర్‌లోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గత 25 సంవత్సరాలుగా ఆలయ కమిటీ ధర్మకర్త బిజిలి సాంబయ్య ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు జరుపుతూ వస్తున్నారు. శనివారం తెల్లవారుజామున 3గంటల నుంచి భక్తుల దర్శనం ప్రారంభం అవుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ ప్రాంతంలో భజన మండలి వారిచే భజన కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

◆ పేట్‌బషీరాబాద్‌లోని శివాలయంలో శనివారం తెల్లవారు జాము నుంచి ఆదివారం ఉదయం వరకు 24గంటల పాటు స్వామివారికి అభిషేకాలు నిరాటంకంగా కొనసాగనున్నాయి.

◆ సూరారం ఉమామహేశ్వర ఆలయంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అభిషేకాలు, రాత్రి జాగరణ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ధర్మకర్త తెలిపారు.

మానవతా విలువలు నేర్పుతూ..



జగద్గిరిగుట్ట: కాంక్రీట్ జంగల్‌గా మారిన మన మహానగరంలో పశుగ్రాసం లేక మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఎవరైన ఏమైన పెడతారేమోనని ఆశగా కాలనీ రోడ్లపై తిరుగుతూ మనకు కనిపిస్తుంటాయి. ఏమి దొరకకపోతే రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ కాగితాలను నమ్ములుతూ పశువులు తమ ఉదరాన్ని నింపుకుంటున్నాయి. అయితే జగ్గిరిగుట్ట ప్రాంతంలో ఓ తండ్రి మాత్రం గోమాత ఆకలి తీర్చే విధంగా తన కొడుకుతో గోవులకు పండ్లను ఆహారంగా అందించి మానవతా విలువలు నేర్పిస్తున్న సన్నివేశం అక్కడి చూపర్లను ఆకట్టుకుంది.

ఎస్‌ఆర్.నాయక్‌నగర్ రోడ్డులో నిత్యం చోరీలు

పెట్రోలింగ్ పెంచాలని కాలనీవాసుల డిమాండ్

జీడిమెట్ల: జీడిమెట్ల డిపో నుంచి ఎస్ఆర్ నాయక్‌నగర్ వెళ్లే రోడ్డులో పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. డిపో వద్ద బస్సు దిగి వస్తున్న యువతుల వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయిన సంఘటనలు రెండు రోజుల్లో చోటు చేసుకున్నాయి. బుధవారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఎస్ఆర్ నాయక్‌నగర్‌కు చెందిన యువతి జీడిమెట్ల డిపో వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుంది.

◆ ఈ క్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి సదరు యువతి చేతిలోని సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయాడు. సదరు యువతి ఏమి చేయలేక భయంతో ఇంటికి వెళ్లిపోయింది. గురువారం రాత్రి మరో యువతి నడుచుకుంటూ వెళ్తుంది. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ లాక్కుని పారిపోయాడు. వరుసగా రెండు సంఘటనలు జరగడంతో ఉద్యోగం ముగించుకుని ఇంటికి వచ్చే యువతులు, మహిళలు భయంతో జంకుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

లైటింగ్, సీసీ కెమెరాలు లేకపోవడమే ప్రధాన కారణం..

జీడిమెట్ల డిపో నుంచి ఎస్ఆర్ నాయక్‌నగర్‌కు వెళ్లే దారిలో స్ట్రీట్‌లైట్స్ లేకపోవడంతో చీకటిగా ఉంటుంది. దీనికి తోడు ఇండస్ట్రీయల్ రోడ్డులో సీసీ కెమెరాలు సైతం లేవు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ల దొంగతనానికి పాల్పడుతున్నారు.

నీటి విలువ తెలిసినోడు..

జగద్గిరిగుట్ట: ప్రతి నీటి బొట్టు ఒడిసి పట్టు.. ఇది జలమండలి శాఖ నుంచి నిత్యం మనకు వినిపించే నినాదం. అయితే జగద్గిరిగుట్ట డివిజన్ సోమయ్యనగర్ ప్రధాన రహదారిలో శుక్రవారం మంజీరా పైపు లీకై వేల కొద్ది లీటర్ల మంచినీరు రోడ్డు పాలైంది. అయితే నీటి వృథాను గమనించిన ఓ వృద్ధుడు ఇటీవల పక్కనే ఓ గల్లీలో నూతనంగా వేసిన రోడ్డు క్యూరింగ్‌కు ఆ నీటిని మళ్లించాడు. అతను చేసిన ప్రయత్నాన్ని చూసి స్థానికులు అభినందించారు.


వృథాగా పోతున్న నీటిని రోడ్డు క్యూరింగ్‌కు మళ్లిస్తున్న వృద్ధుడు

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పాటు పడుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శుక్రవారం శంభీపూర్‌లోని తన కార్యాలయంలో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.3.05 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించే లక్ష్యంతో సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ తెలంగాణ శాసనమండలి ప్రభుత్వ విప్‌గా నియమితులైన శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి పలువురు ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాక్షించారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

గిరాకే.. గిరాకీ



సుభాష్‌నగర్: శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఒకరోజు ముందు శుక్రవారం నుంచి పండ్లకు గిరాకీ పెరిగింది. కుత్బుల్లాపూర్ నియోజవర్గ పరిధిలోని షాపూర్‌నగర్, జగద్గిరిగుట్ట, సూరారం, సుచిత్ర ప్రధాన రోడ్ల పక్కన పండ్ల మార్కెట్లను ఏర్పాటు చేశారు. పండగ రోజు ధరలు పెరుగుతాయని ఒక రోజు ముందే చాలామంది కొనుగోలు చేశారు. శనివారం సాయంత్రం 4గంటల వరకు గిరాకీ ఉంటుందని పండ్ల వ్యాపారులు తెలిపారు. రెండు రోజుల క్రితం నుంచి పోలిస్తే పండ్లపై ఐదు నుంచి పది రూపాయలు పెంచి అమ్మకాలు జరిపారు.

సన్యాసం తీసుకునేందుకు వెళ్తున్నానని..

లెటర్ రాసి వెళ్లిపోయిన యువకుడు


అమ్యరంజన్ సాహూ (ఫైల్)

కుత్బుల్లాపూర్: సన్యాసం తీసుకునేందుకు వెళ్తున్నానని లెటర్ రాసి ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ లాస్ట్‌బస్టాప్ ప్రాంతంలో నివాసముండే వ్యాపారి అశ్విన్‌కుమార్ సాహూ కుమారుడు అమ్యరంజన్ సాహు(20) నీట్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. ఈనెల 15వ తేదీన సుభాష్‌నగర్‌లో ఉండే అశ్విన్‌కుమార్ అన్న కుమారుడు సత్యరంజన్‌తో కలిసి చదువుకుంటానని చెప్పి వెళ్లిన అమ్యరంజన్ రాత్రైనా ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు అతని కోసం వాకబు చేయగా సుభాష్‌నగర్‌కు రాలేదని తెలిసింది. అతని మొబైల్ ఫోన్‌కు ప్రయత్నిస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. కాగా అమ్యరంజన్ తాను సన్యాసం తీసుకునేందుకు ఇస్కాన్ టెంపుల్‌కు వెళ్తున్నానని రాసిన ఓ లెటర్ లభ్యమైంది. అతను మొబైల్ ఫోన్‌ను ఇంట్లో ఉంచి సిమ్‌ను మాత్రం తన వెంట తీసుకువెళ్లాడు. యువకుడి తండ్రి అశ్విన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాల పేరుతో ప్రభుత్వం మోసం

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి


హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఆయన గణేష్ నగర్, పద్మానగర్, ఎన్టీఆర్‌నగర్, సురేందర్‌నగర్, పాపయ్యయాదవ్‌నగర్, సూర్యనగర్, రామిరెడ్డినగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం గడప గడపకు తిరుగుతూ.. పార్టీ విధానాలను వివరించే కరప్రతాలను అందజేశారు.

◆ ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ... సంక్షేమ పథకాలతో పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రాజెక్టుల పేరుతో వేలాది కోట్ల కమీషన్లను సీఎం కేసీఆర్ ఆయన కుటుంబసభ్యులు దండుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, జేమ్స్, సంజీవరెడ్డి, ఆనంద్‌రావు, ఏ-బ్లాక్ సెక్రటరీ బాలయ్య, ఎండీ జాకీర్, హఫీజ్, ఆగమయ్య, సిద్దయ్య, ఈశ్వర్, బాలరాజు, సంగమ్మ, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సందల్, ఉర్సు


ఉర్సులో పాల్గొన్న వైఎస్సార్‌టీపీ అసెంబ్లీ కో.ఆర్డినేటర్ సాతాల గోపాల్

సుభాష్‌నగర్: గాజులరామారం బతుకమ్మబండ బస్తీలోని బడి పహాడ్ సయ్యద్‌షాదుల్లా హుస్సేన్ బాబా దర్గాలో శుక్రవారం సందల్, ఉర్సు జరిగాయి. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌టీపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అసెంబ్లీ కో.ఆర్డినేటర్ సాతాల గోపాల్ హాజరై చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు చెట్ల వెంకటేష్, గోపీనాథ్, ఎస్.వెంకటేష్, దర్గా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నగలు ఎత్తుకెళ్లిన నిందితుల రిమాండ్

కుత్బుల్లాపూర్: తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడి విలువైన నగలను ఎత్తుకెళ్లిన పలువురి నిందితుల నుంచి పేట్‌బషీరాబాద్ పోలీసులు సొత్తును రికవరీ చేశారు. డిటెక్టీవ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలోని ఎంఎన్ రెడ్డినగర్, దూలపల్లి, మేడ్చల్ పీఎస్ పరిధిలోని రాజబొల్లారం ప్రాంతాల్లో ఇళ్లల్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలను తస్కరించిన ముఠా సభ్యుల నుంచి పేట్ బషీరాబాద్ పోలీసులు సొత్తును రికవరీ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఐ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

వాహన పన్ను చెల్లించని 90వాహనాల సీజ్

కుత్బుల్లాపూర్: వాహన పన్ను చెల్లించకుండా తిరుగుతున్న వాహనదారులపై మేడ్చల్ ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపించారు. మేడ్చల్ జిల్లా రవాణా శాఖ అధికారి కిషన్ ఆదేశాలతో శుక్రవారం జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎనిమిది మంది అధికారుల బృందం వాహనాల తనిఖీలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పేట్‌బషీరాబాద్, సుచిత్ర, కొంపల్లి తదితర ప్రాంతాల్లో వాహనదారులను ఆపి పత్రాలను పరిశీలించారు. వాహన పన్ను చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్న 90 వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేశామని, పలువురు వాహనదారుల నుంచి చలాన్‌లు వసూలు చేసినట్లు జిల్లా రవాణాశాఖ అధికారి కిషన్ తెలియజేశారు.

కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు


సాయిబాబానగర్‌లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే,బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం సుభాష్‌నగర్ డివిజన్ సాయిబాబానగర్‌లోని 521, 522 బూత్‌లలో జరిగిన ప్రజా గోస-బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 20వేల లీటర్ల ఉచిత నీటి సరఫరా హామీని ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. పేదల నుంచి ముక్కు పిండి వేలల్లో బిల్లులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజా సమస్యలను గాలికొదిలి తన అనుచరులతో భూకబ్జాలకు పాల్పడుతున్నాడని... ఎన్నికల హామీలను నెరవేర్చకుండా సీఎం కేసీఆర్ భజన చేస్తున్నాడని ఎద్దేవా చేశారు.

◆ పుట్టబోయే బిడ్డలపైనా రూ.లక్ష అప్పు ఉందంటే రాష్ట్ర ప్రభుత్వ పనితీరును అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రాన్ని ఉద్ధరించని వాడు దేశాన్ని ఉద్ధరించడానికి బయలు దేరాడని కేసీఆర్‌ను ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ కుమ్మరి శంకర్, కృష్ణగౌడ్, బూత్ అధ్యక్షులు మహేష్, రాజు, డివిజన్ అధ్యక్షుడు కంది శ్రీరాములు, నాయకులు సంతోష్, నాని, కృష్ణ చారి, ప్రభాకర్ రావ్, రమణారెడ్డి, భరత్, ప్రవీణ్, యాదిలాల్, పాండుయాదవ్, పన్నా ప్రముఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అదే విధంగా అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో పండ్లు పంపిణీ చేశారు. శంభీపూర్‌లో కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారనుందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చి సత్తా చాటుతామన్నారు. - కుత్బుల్లాపూర్


స్మృతి ఫౌండేషన్‌లో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు


చింతల్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్


ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న దేవేందర్